# ఘోరం!

శ్రీ మూర్తి

పిండి అరబోసినట్లు పండువెన్నెల కాస్తుంది. పక్షులు తమతమ కులాయాల్లో శ్రావ్యమైన గొంతులు విప్పి కమనీయంగా సరసపధారల్ని కురిపిస్తున్నాయి. చంద్రుడుకంటే పెద్దవినీ, కాంతిగలవినీయైన నక్షత్రాలు తమ నిరాడంబరాన్ని చాటుతున్నాయో అన్నట్లు ఆకాశాన మినుకు మినుకు మంటున్నయ్. హాయిగా వీస్తూన్న గాలిలో మిళితమై—సముద్రుడు చేస్తూన్న—ప్రణవీనాదం వినడానికి యింపుగావుంది. అరవిచ్చిన లేత గులాబి అధర సుధను సారంగునకు, మేని గంధవాహునకు పంచియిచ్చి జారిణి యింది. పండువెన్నెల తళతళలు, శకుంత సంతాన కూజిత కలకలలు, భూదేవియొక్క మిలమిలలు యేకకేంద్రస్తానంలో మిళితమై ప్రకృతిమాతనో నూతనాభరణభూషితగాచేసినై.

అట్టి ప్రశాంత సమయంలో పూరి వెలుపలున్న చిన్న చుట్టు పూరింటి ముందర కుక్కినులక మంచంలో పడుకున్న తల్లి, ప్రక్కనే చింపి చాపమీద కూచున్న మోహన్.

"అది కాదమ్మా! యికముందు మన శిథిల జీవన సారాన్ని చదువుల కొరకు వినియోగించలేం"

"యేమోలే! కష్టేఫలే అన్నారు పెద్దలు"

"యేమోలే, యీ విద్యాయాగ పూర్తికొరకు నా మాతృదేవిని పశుధనంగా బలీయడానికి నామనసు సుతలామూ యిష్టపడ్డం లేదు."

"యేమిటా మాటలు; మోహన్."

"యేముందమ్మా! కని, పెంచి, పెద్దచేసినందుకు యీవృద్ధాప్యంలో నిన్ను సుఖపెట్టాల్సిన మాటటుంచగా, పైగా నీచేతనానా"

"ఇస్! పూరుకుండూ! కష్టమో, నిష్టూరమో యేదో కాస్త నీవు ప్రయోజకుడవై పచ్చ పచ్చగా వుంటే నాకదే పదివేలు."

"అని ఆ కాస్త యెండుబారిన కండలుకూడా కిరిగిస్తా నంటావా"

"బావుంది మోహన్ నీధోరణి. చదువుకున్న వాడివి; నీతో మాట్లాడ్డం కష్టం బాబూ. మరి యిక ముందు యేం చేస్తావో నీవే ఆలోచించి చెప్పు."

"నేననుకున్న దేమంటే, యెదురుగా కనిపిస్తూంది కదా ఐ. యల్. టి. డి. యేదో చిన్నప్పట్నుంచి, మన అవస్త చూస్తున్న శిరోమణిగారున్నారు కదా అమాత్రం సహాయం చేయక పోతారా అని"

"మంచియోచనే చేశావ్ మోహన్. రేపే శిరోమణిగారి దగ్గరకు వెళ్లి బ్రతిమాలుకుందామ్."

ఔనన్నట్టుగా మోహనుడు తల వూపాడు.

తల్లి యేవేవో గాలిమేడలు కట్టుకొని నవ్వుకుంటుంది.

◆ ◆ ◆

నమస్కారమండి బాబుగారు"

"గుడ్ బైసార్"

"ఓహో! నీవటోయ్ మోహన్. ఈసంవత్సరం స్కూలు ఫైనల్ పాసయావట"

"ఔనండి"

"ఊ! చురుకైన వాడివి, బుద్ధిమంతుడివీని. పాసు కాక యెక్కడికి పోతుందిగానీ."

"ఇకముందేమి చేయాలో తెలిటం లేదండి. పై చదువులు చదవడానికి మనకు శక్తిలేదాయే. వున్న చదువులు చాలవాయే."

"అ! పై చదువులు చదివినవాళ్లు మాత్రమేం పీక్కుతింటున్నారు గాని"

"అవిషయాన్ని గూర్చి మీతో ఆలోచిద్దామని వచ్చానండి"

"..............."

"యేదో నలుగురితోపాటు మావాణ్ని కూడా ఐ. యల్. టి. డి, కంపెనీలో చేరిస్తిరా."

"ఇప్పుడు కొత్త గుమస్తాలను లాచేర్చడం చాలా కష్టంగా వుందమ్మా. మునుపటిలా కాదు ప్రతిదానికి దొరతనిఖీ. మరీ మొన్న సమ్మెదగ్గర్నుంచి."

"అదంతా మీదయ. మీరు పెట్టిన భిక్షను తుంటాము''

"..............."

◆ ◆ ◆

"యేమోయ్ వెంకటేశం! యేంచేశావ్. నీవిలా వొట్టి చేతుల్తో తిరిగితే లాభంలేదోయ్"

"లేదండి సార్! తీసుకొచ్చానండి"

యేమాత్రం అన్నట్టుగా కన్ను యెగురవేసి చూస్తాడు శిరోమణి.

"మీరు చెప్పినంతాను''

"ఆ బల్లమీద పెట్టు"

వెంకటేశం పది రూపాయలు బల్లమీద వుంచాడు.

"వెంకటేశం! రేపు పదిహేనో తారీకున అప్లికేషను వ్రాసి లంకాస్టరు దొరగారికి పంపు. నేను నీ విషయమై వారితో చెప్తా''

"చిత్తం"

"అప్లికేషను వ్రాసే పద్ధతి రాత్రికివస్తే నేనే వ్రాసి చూపిస్తా''

చిత్తం. అలాగే"

"మరి వెళ్లు''

వెంకటేశం వెళ్ళిపోయాడు.

"ఇలా డబ్బిచ్చిన వాళ్ళనే చేర్చలేక చచ్చిపోతున్నానోయ్. నేమాత్రం యెంతమంది కని సహాయం చేయను.''

శిరోమణి వుద్దేశాన్ని గ్రహించిన మోహనుడు జాలిలా తల్లివంక చూస్తాడు.

"అబ్బాయికి పనియిప్పించాలే గానీ మేం మాత్రం మీరు చేసిన సాయం మరచిపోతామా బాబూ? యేదో మీరు కోరినంత కాకపోయినా మాశక్తి కొద్ది ......"

"అలాగే లేమ్మా! మోహన్ నీవుకూడా పదిహేనో తేదీ అప్లికేషను వ్రాసి లంకాష్టరు దొరగారికి పంపు. నీకు పని కుదిరేలానే చేస్తా."

"మాకదే పదివేలు బాబు: నీకడుపున పుడతా"

"మంచిదమ్మా! వెళ్ళిరండి."

బరువైన గుండెతో, కాళ్ళీడ్చుకుంటూ మోహనుడు, పట్టరాని సంతోషంతో తల్లి యెళ్లిపోయారు.

◆ ◆ ◆

ఉదయం ఎనిమిది గంటలైంది. ఐ. యల్. టి. డి. కంపెనీ సింహద్వారము యెదుట మైదానమంతా జనులతో కిటకిట లాడుతూంది. ద్వారము ప్రక్కగా వున్న వేపచెట్టు నీడను కొందరు యువకులు యేదో బాతాఖానీ చెప్పుకుంటున్నారు. కొందరు పులి, మేక లాటాడు కొంటున్నారు—పదిగంట లైంది. కొందరు జనులు విసిగిలో లోపల కంపెనీ యజమాన్ల తిట్టుకుంటూ యిండ్లకు దారిపట్టారు. ఇంతలో శిరోమణి చకచకావచ్చి వేపచెట్టు నీడనున్న యువకులను కొందరిని పేరు పేరున పిలిచి లోపలకు తీసుకెళ్ళాడు. మన మోహనరావుకూడా శిరోమణి బయటకు రాగనే నమస్కారం చేసి యెదురు వెళ్ళాడు కానీ "ఘడియసేపాగపోయ్'' అని సమాధానం చెప్పి శిరోమణి వెళ్ళిపోయాడు.

◆ ◆ ◆

కారు మబ్బులు కమ్ముకుంటున్నయ్. ఘోరమన గాలి వీస్తోంది. మిగతవున్న జనంకూడా గుంపులు గుంపులుగా లేచి వెళ్ళిపోయారు. మన మోహనుడుమాత్రం వేపచెట్టు క్రింద కూచుని యెవరికోరకో నిరీక్షిస్తున్నాడు. కంపెనీలోనివారు కూడా గుంపులు గుంపులుగా బైటకు వస్తున్నారు. చివరకు 'ఘూర్' మని శబ్దం చేసుకుంటూ శిరోమణి కారువచ్చింది. మోహనుడు ఆత్రంగా కారుదగ్గరకు వెళ్ళాడు. ఆగలేదు కాని "ఈ సంవత్సరం ఖాళీలు లేవోయ్. వచ్చే సంవత్సరం" మన్న మాటలు మోహనుడి చెవిని పడ్డాయి. మోహనుడు స్తబ్ధుడై పోయాడు. పాపం మోహనుడి అవస్తసంతా నెల రోజులనుంచి చూస్తున్న ప్రకృతి మాతవర్ష రూపమున కన్నీరు కార్చింది. ఇంతలో 'ఘూర్'' మని వొక సుడిగాలి వీచింది. మోహనుడి కంతా ఘోరంగానే వుంది. ఒకగాలి తెరతల్లియొక్క హృదయాన్ని తాకింది. వెంటనే 'ఘూర్' మని ప్రతిధ్వనించింది దిగ్దిగంతాలు కంపించేలా తల్లియొక్క హృదయ గహ్వరం.